## కథాకేళి



# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## ఓటమి

1988 నవంబర్ ఇరవై నాలుగు.

హాస్పిటల్‌లో కాంపౌండర్‌గా పని చేసే హృషికేష్‌కి అతనింటి కొచ్చి చెప్పాడు డాక్టర్.

"మీ అమ్మగారికి సీరియస్‌గా వుందిట. అర్జెంట్‌గా నిన్ను నెల్లూరు రమ్మని మా ఇంటికి మీ నాన్నగారు ఎస్.టి.డి. చేసి ఇప్పుడే చెప్పాడోయ్. వెంటనే బయలుదేరు".

"అయ్యయ్యో! అలాగేనండి" చెప్పాడు హృషికేష్.

అతనింకా బ్రహ్మచారే. గబగబ బ్రీఫ్‌కేస్‌లో రెండు జతల బట్టలు, టూత్‌పేస్ట్, బ్రష్, షేవింగ్ కిట్ వేసుకుని గదికి తాళం వేసి కవాడిగూడ నుంచి బస్ డిపోకి బయలుదేరాడు.

సరిగ్గా అరగంటలో బస్ డిపోకి చేరుకున్నాడు. నెల్లూరు వెళ్ళే బస్ ఒకటి అరగంటలో వుంది. టిక్కెట్ల కోసం చూస్తే బస్సు వచ్చాక కాని ఇవ్వరని తెలిసింది. అక్కడి ఇన్‌ఛార్జికి తన తల్లి ఆకస్మిక అనారోగ్యం గురించి చెప్పి తనకో టిక్కెట్ ఇచ్చే ఏర్పాటు చేయమని కోరాడు.

"తప్పకుండా" ఒప్పుకున్నాడాయన.

ఓ వార పత్రిక కొనుక్కున్నాడు. దాన్ని చదువుదామని ప్రయత్నించినా కార్టూన్స్ మించి ఇంకేం చదవలేక పోయాడు. పావుగంట లేటుగా వచ్చింది బస్సు. హృషికేష్ తనకి టిక్కెట్ విషయంలో సహాయం చేస్తానన్న వ్యక్తి దగ్గరికి వెళ్లాడు.

"సారి అండి. బస్ ఫుల్‌గా వుంది" చెప్పాడతను.

"ఒక్క సీటు కూడా ఇప్పించ లేరా?" అడిగాడు.

"టిక్కెట్ కొన్న వాళ్లలో ఎవరైనా రాకపోతే అది మీకు ఇచ్చే పూచీ నాది. లేదా విజయవాడ బస్సులో వెళ్లండి. అక్కడ మీకు రైలు కనెక్షన్ ఒకటి గంటలో దొరుకుతుంది."

బస్సు బయలుదేరడానికి పది నిమిషాల ముందే అంతా ఎక్కేసారు. ఎవరూ రాకుండా లేరు.

ఆ సంగతి చెప్పి చెప్పాడు ఆ అధికారి.

"ఎం.ఎల్.ఎ . సీట్లు రెండు ఖాళీగా వున్నాయి. ఇంతదాకా ఎవరూ రాలేదు. ఎవరూ రాకపోతే అందులో ఒకటి మీకిస్తాను".

మళ్ళీ హృషికేష్‌లో ఆశ కలిగింది. ముందు రిజర్వ్ చేయించుకోలేదు. ఇంత దాకా రాలేదంటే ఎవరూ రాకపోవచ్చు. ఆ సంగతే చెప్పి టిక్కెట్ ఇవ్వచ్చుగా అంటే ఆ ఆర్.టి.సి. అధికారి బదులు చెప్పాడు.

"ఒకోసారి లాస్ట్ మినిట్‌లో వచ్చి ఎక్కుతుంటారు. బస్సు కదలడానికి అయిదు నిమిషాల ముందుదాకా దాన్ని వాళ్ళ కోసం వుంచి తర్వాతే ఎవరికయినా ఇవ్వాలి".

బస్సు కదలడానికి సరిగ్గా అయిదు నిమిషాల ముందు వచ్చారు ఇద్దరు. వాళ్ళు ఆ అధి కారితో మాట్లాడి టిక్కెట్లు కొని యం.యల్.ఏ. సీట్‌లో కూర్చోన డంతో హృషికేష్ అడిగాడాయన్ని.

"అవి ఫిలప్ అయిపోయాయి సార్!"

ఆయన చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

"అవును. ఓ యం.యల్.ఎ. తన ఫ్రెండ్‌తో వచ్చారు. విజయవాడ దాకా వెళ్తున్నారు. మీరు అడిగి చూడండి."

హృషికేష్ వాళ్ళిద్దరి దగ్గరకి వెళ్లి చెప్పాడు తన తల్లికి సీరియస్‌గా వుందని, తను అర్జెంటుగా నెల్లూరు వెళ్లాలని, విజయవాడ దాకానే కనుక వాళ్లని అరగంట తర్వాత బయలుదేరే బస్సులో వెళ్లమని.

"ఇది మా యం.యల్.ఎ. సీటు. మీరే వెనక బస్సులో వెళ్లండి" గద్దిస్తూ చెప్పాడు రామకృష్ణ. వై.

"ఏమన్నారు?" అడిగాడు ఆర్.టి.సి. అధికారి.

"సీట్ ఇవ్వనన్నారు. పోన్లెండి. మీరు చెప్పినట్టు విజయవాడ దాకా బస్‌లో వెళ్లి అక్కడ నించి రైల్లో వెళ్తాను".

"సారి. మీకు హెల్ప్ చేయలేనందుకు" చెప్పాడు ఆ అధికారి నొచ్చుకుంటూ.

"ఇంతకీ ఎవరా యం.యల్.ఎ.?" అడిగాడు హృషికేష్ కొద్దిసేపాగి.

"రామకృష్ణ వై. ముషీరాబాద్ కాన్‌స్టిట్యుయెన్సీ అతను" చెప్పాడు ఆ అధికారి.

హృషికేష్ విజయవాడ దాకా వెళ్లాడు. కాని తర్వాత చాలా లేటయింది. కలకత్తా నించి మద్రాసు వెళ్లే ఆ రైలు లేట్‌గా వచ్చింది. నెల్లూరుకి బస్సులు కూడా వెంటనే లేవు.

హృషికేష్ నెల్లూరులోని లక్ష్మి నగర్‌లోని తన ఇంటికి వెళ్లేసరికి ఏడుపులు వినిపిస్తున్నాయి. గుమ్మంలో అడుగుపెట్టిన అతన్ని చూసి అతని చెల్లెలు కళ్ల నీళ్లతో చెప్పింది బాధగా.

"నువ్వు ఒక్క అయిదు నిమిషాలు ముందు రావల్సిందన్నయ్యా".

తన తల్లి పోయి అయిదు నిమిషాలైందని అర్థమైంది హృషికేష్‌కి.

* * *

1989 డిసెంబరు నెలలో ఓ రోజు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తున్నారు. ముషీరాబాద్ కాన్‌స్టిట్యుయెన్సీలో నిలబడ్డ డి.బలరాం ఒకే ఒక్క ఓటు ఆధిక్యతతో గెలిచి తన సమీప అభ్యర్థి రామకృష్ణ వై.ని ఓడించారని ప్రకటించగానే ఆ ప్రకటన వింటున్న రామకృష్ణ మొహం ఒక్క క్షణంలో వాడిపోయింది. కళ్ళ వెంట నీళ్లు అప్రయత్నంగా కార సాగాయి.

ఒకే ఒక్క ఓటు తేడాతో ఓడిపోవడం ఎంత దురదృష్టం?

కొద్ది క్షణాల్లో టెలిఫోన్ మోగింది. ఆయన భార్య రిసీవర్ని రామకృష్ణ వై.కి ఇచ్చి చెప్పింది.

"ఎవరో మీతోనే మాట్లాడాలిట."

"హలో" చెప్పాడు బలహీనంగా.

"నా పేరు హృషికేష్. సంవత్సరం క్రితం నెల్లూరు వెళ్లే బస్సులో నాకో సీటు లేకుండా చేసారు. గుర్తున్నానా? ఎన్నికల్లో మీకు తక్కువై మీ ప్రత్యర్థికి ఎక్కువైన ఒక్క ఓటు నేను వేసిందే అవడం నాకెంతో సంతోషంగా వుంది. "ఇంకో అయిదేళ్ల దాకా మీరు బస్సులో నాలా ప్రత్యేకమయిన సీటు, హోదా లేకుండా ప్రయాణిస్తారని తెలియ జేయాలని మీ ఓటమి గురించి విన్నాక ఫోన్ చేసి చెప్తున్నాను" అన్న మాటలు వినిపించాయి రామకృష్ణ వై.కి. ●

